ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

మంగళవారం 30 సెప్టెంబరు 2025





బాధితులను ఓదార్చుతున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న జస్టిస్ అరుణా జగదీశన్



39 మంది మృతికి విజయ్ కారణమంటూ కరూర్‌లో వెలసిన పోస్టర్లు

కోలుకోని కరూర్

41కి పెరిగిన మృతుల సంఖ్య

- రెండో రోజూ సాగిన న్యాయ విచారణ
- సీసీ ఫుటేజీ, డ్రోన్ దృశ్యాల స్వాధీనం
- చెట్టుపై జారిపడి మృతిచెందిన వారి వివరాల సేకరణ
- పట్టణంబాక్కం ఇంటికి విజయ్
- పుకార్లు పుట్టించకండి : ముఖ్యమంత్రి వినతి
- ఎవ్వరినీ తప్పుపట్టలేం : నిర్మలా సీతారామన్

చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ ప్రచారం సందర్భంగా జరిగిన తొక్కిసలాటతో ఉక్కిరిబిక్కిరైన కరూర్ ఇంకా కుమిలిపోతూనే వుంది. రోజురోజుకు మృతుల సంఖ్య పెరిగిపోతుండడంతో విషాదం నుంచి బయటపడలేకపోతోంది. కరూరు ఘటనలో మృతిచెందిన వారి సంఖ్య సోమవారం 41కి పెరిగింది. శనివారం జరిగిన తొక్కిసలాట కారణంగా తొమ్మిదిమంది చిన్నారులు సహా 40 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గాయపడిన మరో 11 మందిని ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో, కరూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేలుస్వామిపురానికి చెందిన నల్లస్వామి భార్య సుగుణ (65) సోమవారం తెల్లవారుజామున కన్నుమూసింది. ఓ సంస్థలో పనిచేస్తున్న ఆమె విజయ్‌ను చూసేందుకు ప్రచార ప్రాంతానికి వచ్చింది. ఆ తరువాత ఆమె ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమెకోసం గాలించిన కుటుంబీకులకు ఆదివారం ఆమె ఆస్పత్రిలో వున్నట్లు స్పష్టమైంది. ఈ నేపథ్యంలో సుగుణ సోమవారం మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో మృతుల సంఖ్య 41కి పెరిగినట్లయింది. కాగా, ప్రస్తుతం కరూరు ప్రభుత్వాసుపత్రిలోనే 45 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో ఏడుగురు మహిళలు సహా 11 మంది ఐసీయూలో చికిత్స పొందుతుండగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

సీసీ ఫుటేజీ, డ్రోన్ దృశ్యాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు...

విజయ్ వాహనం నిలిపిన ప్రదేశం పక్కనే ఉన్న మురికినీటి కాలువలో పడి పలువురు మృతి చెందినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో, పోలీసులు ఆ ప్రాంతంలో వాణిజ్య సంస్థలు, దుకాణాల్లోని సీసీ ఫుటేజీ , డ్రోన్ల ద్వారా చిత్రీకరించిన దృశ్యాలను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు తొక్కిసలాటలో 39 మంది మృతికి విజయ్ కారణమంటూ కరూర్ జిల్లాలో కొన్నిచోట్ల వెలసిన పోస్టర్లు సంచలనం రేపుతున్నాయి.

పట్టణంబాక్కం ఇంటికి విజయ్...

కరూర్ ఘటన అనంతరం తిరుచ్చి నుంచి నేరుగా చెన్నై వచ్చిన విజయ్.. పనయూర్‌లోని తన ఇంట్లోనే వున్నారు. రెండు రోజులుగా ఎవ్వరినీ కలుసుకోకుండా, అక్కడే వున్న విజయ్.. సోమవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వచ్చి కారులో పట్టణంబాక్కంలోని తన ఇంటికి వెళ్లారు. దీంతో పట్టణంబాక్కం ఇంటి వద్ద కూడా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

చెట్లపై నుంచి పడి మృతిచెందిన వారి వివరాలు ..

ఘటన జరిగిన రోజు విజయ్‌ను దగ్గరి నుంచి చూడాలన్న అత్యుత్సాహంతో వందలాదిమంది అభిమానులు, టీవీకే కార్యకర్తలు సమీపంలోని చెట్లపైకి ఎక్కారు. అభిమానులు, విజయ్‌ను చూసి కేకలు పెడుతూ, ఈలలు వేశారు. ఆ సమయంలో చెట్ల కొమ్మలు విరగడంతో పలువురు కిందపడినట్లు స్థానికులు చెబుతున్నారు. అలా కిందపడిన వారిలో కొందరు మృతిచెందినట్లు తెలుస్తోంది. దీంతో అటవీ శాఖ అధికారులు, సభ జరిగిన చుట్టుపక్కల ఆరు చెట్లున్నట్లు గుర్తించారు. ఆ ప్రాంతాలను పరిశీలించిన అధికారులు, చెట్టుపై నుంచి కింద పడి మృతిచెందిన వారి వివరాలు సేకరిస్తున్నారు.

దర్యాప్తు అధికారి మార్పు...

కరూర్ దుర్ఘటనపై దర్యాప్తు చేస్తున్న డీఎస్పీ సెల్వరాజ్‌ని రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అయన ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో, డీఎస్పీ సెల్వరాజ్ స్థానంలో కరూరు ఏడీఎస్పీ ప్రేమానందను విచారణ అధికారిగా నియమించారు. ఆయన సోమవారం వేలుస్వామిపురానికి వెళ్లి విచారణ ప్రారంభించారు.

కరూర్ ఘటనలో ఎవ్వరినీ తప్పుబట్టలేం

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

కరూర్ దుర్ఘటనలో ఎవ్వరినీ తప్పుబట్టలేమని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కరూర్‌లో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని సోమవారం ఉదయం కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ఎల్.మురుగన్ పరిశీలించారు. అనంతరం ఇటీవల కరూర్‌లో డీఎంకే నిర్వహించిన ముప్పెరుంవిలా మహానాడు స్థలాన్ని కూడా వారు పరిశీలించారు. ఆ తరువాత ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆ తర్వాత జిల్లా ఎస్పీ జోష్ తంగయ్యతో కలిసి కరూర్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం నిర్మల మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ సూచనతో కరూర్ బాధితులను పరామర్శించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన సహాయాన్ని తక్షణం బాధిత కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని వివరించారు. ఘటన జరిగిన రోజే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు సంతాపం తెలిపారన్నారు.కరూర్ తొక్కిసలాటలో 41మంది మృతిచెందడం దురదృష్టకరమని, ఈ వ్యవహారంలో ఎవ్వరినీ తప్పుబట్టలేమన్నారు. తాము వివిధ శాఖల అధికారులు, బాధిత కుటుంబాల నుంచి సేకరించిన వివరాలు, అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రధానికి అందజేస్తామని చెప్పారు. కరూర్ లాంటి దుర్ఘటన భవిష్యత్తులో పునరావృతం కాకుండా రాష్ట్రప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

51 మంది డిశ్చార్జి

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాటలో గాయపడిన 110 మందిలో 51 మంది ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారని జిల్లా కలెక్టర్ తంగవేలు తెలిపారు. మిగిలిన 60 మందిలో 51 మంది కరూర్ ప్రభుత్వాసుపత్రిలోను, ప్రైవేటు ఆసుపత్రిలో 8 మంది చికిత్స పొందుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

దయచేసి వదంతులు వ్యాప్తి చేయొద్దు : సీఎం స్టాలిన్

'ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా పార్టీ కార్యకర్తలు, అమాయక పౌరులు చనిపోవాలని కోరుకోరు. కాబట్టి, ఈ విచారకరమైన, దుఃఖ వాతావరణంలో, బాధ్యతారహితంగా, దురుద్దేశపూరితమైన పుకార్లు వ్యాప్తి చేయవద్దు' అని ముఖ్యమంత్రి స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం సోమవారం ప్రకటన విడుదల చేశారు. "కరూర్‌లో జరిగింది ఒక విషాదం, ఆస్పత్రిలో నేను చూసిన దృశ్యాలు ఇంకా నా మనసు నుండి తొలగిపోలేదు. నా హృదయం ఇంకా బరువెక్కే వుంది. ఈ ఘటన గురించి విన్న తర్వాత నేను ఇంట్లో ఉండలేకపోయా. అందుకే అధికారులకు ఆదేశాలు జారీ చేసినా, రాత్రికి రాత్రే వెంటనే కరూర్ వెళ్లా. పిల్లలు, మహిళలు సహా 41 మంది బంధువులను కోల్పోయాం. జరిగిన ఘటనపై నిజమైన, పూర్తి కారణాలు తెలుసుకునేందుకు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో ఏకసభ్య విచారణ కమిషన్ ఏర్పాటుచేశాను. కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయని హామీ ఇస్తున్నా. ఈ నేపథ్యంలో, సోషల్ మీడియాలో కొందరు వ్యాప్తి చేస్తున్న పుకార్లు, నకిలీ వార్తల్ని నేను గమనిస్తున్నా. ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా తన మద్దతుదారులు, కార్యకర్తలు, అమాయక ప్రజలు చనిపోవాలని ఎప్పుడూ కోరుకోరు. ఈ ఘటనలో మృతిచెందిన వారు ఏ పార్టీకి చెందినా, నాకు వారు తమిళ బంధువులే కాబట్టి, ఈ విచారకరమైన, దుఃఖకరమైన వాతావరణంలో, బాధ్యతారహితంగా, దురుద్దేశపూరిత వార్తలకు దూరంగా ఉండాలని అభ్యర్థిస్తున్నా. న్యాయ కమిషన్ నివేదిక అందిన తర్వాత, అమలుచేయాల్సిన నిబంధనలు రూపొందిస్తామని హామీ ఇస్తున్నా. మానవ జీవితాలు అన్నిటి కంటే గొప్పవి, మానవత్వం అందరి కర్తవ్యం, రాజకీయ వైరుధ్యాలు, విధానపరమైన విభేదాలు, వ్యక్తిగత శత్రుత్వాన్ని పక్కనబెట్టి ప్రజల సంక్షేమం కోసం అందరూ ఆలోచించాలి. తమిళనాడు ఎల్లప్పుడూ దేశానికి అన్ని విధాలుగా ఆదర్శంగా నిలిచింది. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరుగకుండా నిరోధించడం మనందరి కర్తవ్యం"అని సీఎం పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న ఏకసభ్య కమిషన్ విచారణ...

కరూరు ఘటనపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సోమవారం రెండో రోజూ విచారణ కొనసాగించింది. ప్రచారం జరిగిన ప్రాంతంలో ఒకేచోట పదిమంది మృతిచెందారన్న వ్యవహారంపై కమిషన్ విచారణ జరిపింది. సభ జరిగిన వేలుస్వామిపురం ప్రాంతాన్ని పరిశీలించిన కమిషన్.. ఐదుగురు మృతిచెందిన ఏలూరు గ్రామానికి వెళ్లి విచారించారు. అనంతరం కరూర్ జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ ఘటనను మరింత క్షుణ్ణంగా విచారించాల్సి ఉందని, అందువల్ల నివేదిక సమర్పణకు గడువు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి.

రాత్రికి రాత్రే పోస్టుమార్టం ఎలా ?

- టీవీకే న్యాయవాదుల అనుమానం



మీడియాతో మాట్లాడుతున్న టీవీకే న్యాయవాదులు

చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరూర్ సభలో తొక్కిసలాట మృతులకు రాత్రికి రాత్రే పోస్టుమార్టం చేయాల్సిన అవసరమేంటని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) న్యాయవాదులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైకోర్టు మదురై ధర్మాసనం ప్రాంగణంలో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ... కరూరు సభకు విజయ్ ప్రచార వాహనం తక్కువ వేగంతో నడిపిన మాట వాస్తవమేనని, తమ వెంట వస్తున్న కార్యకర్తలకు ఎలాంటి ప్రమాదం జరగకూడదనే ఉద్దేశంతోనే అలా చేశామని వివరించారు. సహజంగా పోస్టుమార్టం సాయంత్రం 6 గంటల తర్వాత, సూర్యోదయానికి ముందు చేయకూడదనే నిబంధన వుందని, కానీ, ఈ ఘటనలో మృతిచెందిన 39 మందికి ఒకేసారి పోస్టుమార్టం, ఎంబ్లామింగ్ చేయడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అంతమందికి పోస్టుమార్టం చేసేందుకు వైద్యులు ఎక్కడి నుంచి వచ్చారని, ఆ వైద్యులందరికీ పోస్టుమార్టం చేయగలిగే అర్హత వుందా అని సందేహం వ్యక్తం చేశారు. తాము హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లోనూ ఈ విషయాలు పేర్కొన్నామని తెలిపారు. అలాగే, ఒక్కసారిగా పెద్దసంఖ్యలో అంబులెన్స్‌లు ఎలా వచ్చాయన్న సందేహం కూడా ఉందన్నారు. కరూరులో విజయ్ ప్రచారానికి మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు అనుమతులున్నాయన్నారు. ఆ సమయం ప్రకారమే విజయ్ సభకు వచ్చారని తెలిపారు. విజయ్ ఉద్దేశపూర్వకంగా ఆలస్యంగా రాలేదని, కార్యకర్తలు భారీగా వున్నందున నెమ్మదిగా రావాల్సివచ్చిందన్నారు. సభకు 500 పోలీసులతో భద్రత కల్పించామని పోలీసు శాఖ చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని, విధుల్లో కేవలం 137 మంది ఉన్నారని తెలిపారు. ఈ సందేహాలు నివృత్తి చేసేలా ఈ ఘటన విచారణ సీబీఐకి అప్పగించాలని పిటిషన్‌లో కోరినట్లు న్యాయవాదులు తెలిపారు.

రాత్రి సమయాల్లో పోస్టుమార్టం నిర్వహించవచ్చు: రాష్ట్ర ప్రభుత్వం

రాత్రి వేళల్లో పోస్టుమార్టం నిర్వహించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు సమాచార శాఖ విడుదల చేసిన ప్రకటనలో... కరూరు ఘటనలో మృతిచెందిన 39మందికి రాత్రికి రాత్రే పోస్టుమార్టం నిర్వహించారని, సాయంత్రం 5 గంటల తర్వాత పోస్టుమార్టం చేయరాదనే నిబంధనలు అతిక్రమించినట్లు సోషల్ మీడియాలో అవాస్తవాలు పోస్ట్ చేస్తున్నారని తెలిపింది. 2021 నవంబరు 15వ తేది కేంద్ర ఆరోగ్య శాఖ ఇచ్చిన జీవోలో... రాత్రి సమయాల్లో పోస్టుమార్టం నిర్వహించవచ్చని, అందుకు ప్రభుత్వాస్పత్రుల్లో తగిన వసతులుంటే చాలని పేర్కొన్నట్లు గుర్తు చేసింది. శాంతి భద్రతల దృష్ట్యా కరూర్ మృతులకు రాత్రే పోస్టుమార్టం నిర్వహించామని, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మరాదని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

హనుమంత, గజ వాహనాలపై

శ్రీనివాసుడి చిద్విలాసం

ప్యారీస్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ వెంకటనారాయణరోడ్డులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం ఉదయం యాగశాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీవారిని అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి భక్తులను క్యూలైన్ల ద్వారా దర్శనానికి అనుమతించారు. సాయంత్రం 6.30 గంటలకు గజవాహనంపై అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలందుకున్నారు. టీటీడీ చెన్నై సలహామండలి మాజీ నిర్వాహకులు, సభ్యులు, భక్తులు స్వామివారిని సేవించారు. భక్తులకు ఆలయం తరుపున ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా, మంగళవారం ఉదయం 9 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం 6.30 గంటలకు చంద్రప్రభ వాహనం,బుధవారం ఉదయం రథోత్సవం, సాయంత్ర అశ్వవాహనసేవ, గురువారం ఉదయం చక్రస్నానం, సాయంత్రం శ్రీరామచంద్రమూర్తికి పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు ఆయన ఏఈవో కె.పార్థసారథి తెలిపారు.





గజవాహనంపై కొలువుదీరిన శ్రీవారు - హనుమంత వాహనంపై స్వామివారు

కరూర్ దుర్ఘటనపై విచారణకు

6

హేమమాలిని నేతృత్వంలో ఎంపీల కమిటీ

కరూర్ దుర్ఘటనలో తప్పులున్నాయి

- కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ..

7

దసరా అమ్మకాలు ప్రారంభం మార్కెట్లలో కొనుగోలుదారుల రద్దీ



వీధికుక్కల బెడద నుంచి రక్షించండి

- జీసీసీ కౌన్సిల్ సమావేశంలో ఫిర్యాదు



జీసీసీ సమావేశంలో కరూర్ మృతులకు సంతాపం తెలుపుతున్న దృశ్యం

ప్యారీస్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని పలు వార్డుల్లో వీధికుక్కల బెడద ఎక్కువైందని, మరుగుదొడ్లను సక్రమంగా శుభ్రం చేయని కారణంగా దుర్గంధం వస్తోందని సోమవారం జరిగిన జీసీసీ కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కౌన్సిల్ సమావేశం మేయర్ ప్రియ అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభమైన వెంటనే కరూర్ మృతులకు సంతాపం తెలుపుతూ సభ్యులంతా రెండు నిమిషాలు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం కావడంతో పలు వార్డుల సభ్యులు ఆ ప్రాంతాల్లో సమస్యలను ప్రస్తావించారు. వీధికుక్కల బెడద రోజురోజుకు అధికమవుతోందని, జీసీసీ నిర్వహణలోని మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా మారి ప్రజలు వినియోగించలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తండయార్‌పేట జోన్ చైర్మన్ నేతాజీ గణేశన్ మాట్లాడుతూ.. తిరువొత్తియూర్ హైరోడ్డులోని ఎన్నూర్-నెహ్రూనగర్ సమీపంలో రైల్వే వంతెన ఏర్పాటు చేస్తామన్న ప్రకటన నాలుగేళ్లు గడిచినా, పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. 9వ వార్డు కార్పొరేటర్ ఉమ, 7వ వార్డు కార్పొరేటర్ కార్తికేయన్ తమ వార్డుల్లో కనీస వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల క్రితం జీసీసీలో ఖాళీ అయిన 5,594 పోస్టులను భర్తీచేస్తామన్న హామీ నెరవేరేదెప్పుడని అన్నాడీఎంకే కార్పొరేటర్లు మేయర్‌ను ప్రశ్నించారు. నగరంలో చేపట్టిన డ్రైనేజీల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, బయోమెడికల్ వ్యర్థాలు ఏడాది కాలంగా తొలగించలేదని కార్పొరేటర్ డాక్టర్ కార్తికేయన్ ఆరోపించారు. కొత్తగా తాగునీటి కనెక్షన్లకు అధిక రుసుము వసూలు చేస్తున్నారని, కొన్ని సంస్థలు కాంట్రాక్ట్ తీసుకున్నవార్డుల్లో చెత్త సేకరణ సక్రమంగా చేయడం లేదని, మరికొంతమంది సభ్యులు ఆరోపించారు. వీరి ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింజేయనున్నట్లు మేయర్ ప్రియ తెలిపారు. ఈ సమావేశం మొత్తం 65 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

కరూర్ దుర్ఘటనపై విచారణ

ఎంపీ హేమమాలిని నేతృత్వంలో ఎంపీల బృందం

ప్యారీస్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన ఘటనకు సంబంధించి నిజానిజాలు తెలుసుకునేందుకు ఎంపీ హేమమాలిని నేతృత్వంలో ఓ దర్యాప్తు కమిటీని నియమించినట్లు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు. ఎన్డీయే కూటమికి చెందిన ఎంపీలు అనురాగ్ ఠాగూర్, తేజస్వి సూర్య, బ్రిజ్‌లాల్, శ్రీకాంత్ షిండే, అప్రజిత సారంగి, రేఖాశర్మ, పుట్టా మహేశ్‌కుమార్ ఈ బృందంలో ఉన్నారు. వీరు కరూర్‌లో దుర్ఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తారు. మృతుల కుటుంబాలను కలిసి వివరాలు సేకరిస్తారు. అంతేకాకుండా తొక్కిసలాటలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తారు. ఘటనపై సంబంధిత పోలీసు అధికారులు, కలెక్టర్, రెవెన్యూ అధికారులతో సమావేశమై, ఆ వివరాలతో నివేదిక తయారుచేసి కేంద్రప్రభుత్వానికి సమర్పిస్తారని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి.



పారిశుధ్య కార్మికులను అభినందించిన కరూర్ ప్రజలు



బాధితులను చికిత్సకు తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్యారీస్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): తొక్కిసలాట ఘటనలో స్పృహ కోల్పోయిన వారిని ఆస్పత్రికి తరలించడంలో మానవతా దృక్పథంతో సేవలందించిన పారిశుధ్య కార్మికులను పలువురు అభినందిస్తున్నారు. కరూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో పారిశుధ్య పనుల నిర్వహణకు మహారాష్ట్రకు చెందిన ఓ సంస్థతో ఒప్పందం జరిగింది. ఆ సంస్థ తరుఫున మూడు షిఫ్టుల్లో మహిళలు కాంట్రాక్ట్ వేతనంతో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో పర్యటించిన సమయంలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో పలువురు సొమ్మసిల్లి స్పృహ కోల్పోయారు. వారి పరిస్థితి గ్రహించిన పారిశుధ్య కార్మికులు విరామం లేకుండా ఏకంగా మూడు గంటల పాటు బాధితులను ఆస్పత్రికి తరలించారు. వీరిలో ధనం అనే మహిళ నీరసం కారణంగా అనారోగ్యానికి గురైనప్పటికీ తన కర్తవ్యాన్ని మరువకుండా పనిచేశారు. ఈ రకంగా అలుపెరుగక ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆస్పత్రికి తరలించిన పారిశుధ్య కార్మికులను కరూర్ వాసులు అభినందించారు.

వాహనచోదకులూ పారా హుషార్

● దక్షిణ జిల్లాలకు వెళ్లేవారికి పోలీసుల సూచన

ప్యారీస్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): త్రైమాసిక పరీక్షల సెలవులు, బుధవారం ఆయుధ పూజ, గురువారం గాంధీ జయంతి, విజయదశమి వరుస సెలవుల నేపథ్యంలో, రాజధాని నగరంలో నివాసముండే దక్షిణాది జిల్లాల ప్రజలు తమ సొంతూర్లకు పయనమవుతున్నారు. ఈ క్రమంలో శనివారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు, కార్లు, వ్యాన్లలో వెళుతున్నవారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. గత ఏడాది ఇదే రోజుల్లో ఏకంగా 5 లక్షల మంది నగరవాసులు తమ ఊర్లకు వెళ్లినట్లు సమాచారం. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో దక్షిణ జిల్లాల ప్రజలు వాహనాల్లో వెళ్తుండటంతో చెంగల్పట్టు జిల్లాలోని టోల్ ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరాయి. రద్దీ నియంత్రణపై దృష్టిసారించిన పోలీసులు చెంగల్పట్టు జిల్లా మీదుగా వెళ్లేందుకు ప్రయాణికులకు కొన్ని నిబంధనలు విధించారు. జిల్లాలో ఎన్‌హెచ్-32 జీఎస్టీ రోడ్డులో బుక్కదురై, పడాళం రోడ్డు జంక్షన్‌లో రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ పనులు జరుగుతుండటం వల్ల మంగళ, బుధవారాల్లో ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని, ఆదేశించారు. ఆ మేరకు చెన్నై నుండి దక్షిణ జిల్లాలకు వాహనాల్లో వెళ్లేవారు ట్రాఫిక్ రద్దీలో చిక్కుకోకుండా ఈస్ట్‌కోస్ట్ రోడ్డు, జీడబ్ల్యూడీ మార్గం మీదుగా వెళ్లాల్సిందిగా సూచించారు. చెంగల్పట్టు, దక్షిణ చెన్నై ప్రాంతాల నుంచి వెళ్లే వాహనచోదకులు తిరుక్కళికుండ్రం-మేళవంపేట మీదుగా ప్రయాణించాలని తెలిపారు. చెన్నై నుంచి దక్షిణ జిల్లాల వైపు వెళ్లే లోడు వాహనాలు చెంగల్పట్టు-కాంచీపురం బైపాస్ రోడ్డు మీదుగా తిరుముక్కూడల్-నెల్వాయల్ క్రాస్‌రోడ్డు, ఉత్తరమేరు, వందవాసి, దిండివనం మీదుగా వెళ్లాల్సివుంటుంది. నగరం నుంచి పశ్చిమ జిల్లాలకు వెళ్లే వాహనచోదకులు చెంగల్పట్టు జీడబ్ల్యూడీ రోడ్డు మీదుగా వెళ్లాలి. కాగా, చెన్నై, కాంచీపురం జిల్లాల నుంచి చెంగల్పట్టు మీదుగా వెళ్లే లోడు వాహనాలను జీఎస్టీ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం 2 నుండి బుధవారం ఉదయం 3 గంటల వరకు నిషేధించినట్లు పోలీసులు ప్రకటనలో తెలిపారు.

తిరుమల భక్తులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో నిర్వాహకులు

తిరుత్తణి, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని జీఆర్‌హెచ్ హెల్త్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం తిరుమల శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. పళ్లిపట్టులో ఉన్న హరిగోపాల్ మండపంలో నిర్వహించిన ఈ అన్నదానంలో సుమారు 300 మంది పాదయాత్ర భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మండపం నిర్వాహకులు హరిగోపాల్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా తిరుమలకు వెళ్లే భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించి, వృద్ధులకు, చిన్నపిల్లలకు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జ్యోతి, డాక్టర్ మిథున్, గోమతి, దినేష్, కవిత, మాధవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సిద్ధ వైద్య శిబిరం



శిబిరంలో ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూర్ జిల్లా ఏలగిరి కొండ ప్రాంతంలో చెన్నై లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల ఉచిత సిద్ధ వైద్య శిబిరం జరిగింది. సిద్ధ వైద్యులు డాక్టర్ రాధిక, మాధవన్ నేతృత్వంలోని వైద్య బృందం కొండ గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని ఏలగిరి కొండ పంచాయతి అధ్యక్షులు రాజశ్రీ ప్రారంభించారు. శిబిరంలో మాజీ పంచాయతీ అధ్యక్షుడు రాజా, గోవింస్వామి, పొన్నురంగం, అచ్చుతన్, పంచాయతీ ఉపాధ్యక్షుడు ఎ.తిరుమాల్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరండాలో చేరిన మొసలి పట్టివేత



మొసలిని బంధించిన గ్రామస్తులు

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి వరండాలో ప్రవేశించిన పదడుగుల మొసలిని గ్రామస్తులు బంధించారు. కడలూరు జిల్లా చిదంబరం సమీపం కూడువెల్లి ఉత్తరం వీధికి చెందిన అరుణ్‌బాబు ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు రాగా, వరండాలో ఉన్న మొసలిని చూసి దిగ్భ్రాంతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న గ్రామస్తులు అరుణ్‌బాబు ఇంటికి చేరుకున్నారు. అరుణ్‌బాబు సమాచారంతో చిదంబరం అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని మొసలిని బంధించి, సమీపంలోని వక్కరమారి జలాశయంలో వదిలిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



మృతులు ప్రదీప్, అశ్విన్ (ఫైల్ ఫొటో)

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాలో ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కీలోడివాక్కం ప్రాంతానికి చెందిన ప్రదీప్, అశ్విన్ ద్విచక్రవాహనంపై వాలాజాబాద్ వైపు వస్తుండగా, కాంచీపురం నుంచి వాలాజాబాద్ వైపు వెళ్తున్న ప్రభుత్వ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ప్రదీప్ ఘటనా స్థలంలోనే మృతిచెందగా, తీవ్రగాయాలైన అశ్విన్‌ను కాంచీపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై వాలాజాబాద్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

రాందాస్‌తో మాజీ మంత్రి సీవీ షణ్ముగం భేటీ

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌తో అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సీవీ షణ్ముగం సమావేశమయ్యారు. రాందాస్, ఆయన కుమారుడు అన్బుమణి మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. కొద్దిరోజుల క్రితం రాందాస్ చెన్నైలో ఉంటూ, ఆదివారం దిండివనం చేరుకున్నారు. సోమవారం, తైలాపురం తోటలో ఉన్న రాందాస్‌ను మాజీ మంత్రి, విల్లుపురి జిల్లా కార్యదర్శి సీవీ షణ్ముగం కలుసుకున్నారు. సమావేశం అనంతరం షణ్ముగం మీడియాతో మాట్లాడుతూ... తన సోదరుకుడి కుమారుడి వివాహానికి రాందాస్‌ను ఆహ్వానించేందుకు, శుభలేఖ అందజేసేందుకు వచ్చానని, ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు షణ్ముగం తెలిపారు.

లలితా త్రిపుర సుందరిగా కొల్లాపురియమ్మన్



వేడుకల్లో ఆలయ నిర్వాహకులు, భక్తులు

తిరుత్తణి, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో కొలువుదీరిన కొల్లాపురియమ్మన్ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం లలితా త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయ వేదపారాయణం, అమ్మవారి మూలమంత్ర హోమం, అభిషేకం, సాయంత్రం లలితా త్రిపుర సుందరి అలంకారం, దీపారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. చివరగా భక్తులందరికి ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు జయకృష్ణన్, ఉభయ కర్తలు లోకనాథుడు, గీత, నవీన్, సరిత, నిఖిత, హేమ, వర్షిణి, భాస్కర్, ధనలక్ష్మి, ఉమాపతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణి కొండపై కోతుల పట్టివేత



కోతులను బోనులో బంధించిన దృశ్యం

తిరుత్తణి, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ కొండపైకి కాలినడకన వెళ్లే భక్తులను ఇబ్బంది పెడుతున్న కోతులను ఆదివారం సాయంత్రం అటవీశాఖ అధికారులు బంధించారు. ఈ నేపథ్యంలో మురుగన్ కొండకు మెట్లమార్గంలో వెళ్లే భక్తులపై అడవి కోతులు గుంపులుగా దాడి చేస్తున్నట్లు ఆలయ జాయింట్ కమిషనర్ రమణికి అందిన ఫిర్యాదు మేరకు ఆమె ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ అధికారి విజయ్ పార్థసారథి, ఫారెస్ట్ రేంజర్ శంకర్ ఆధ్వర్యంలో మెట్ల మార్గంలో సంచరిస్తున్న సుమారు 25 కోతులను బోనులో బంధించారు. అనంతరం వాటిని సోమవారం ఉదయం కన్నికాపురం రిజర్వు ఫారెస్ట్‌లో వదిలివేశారు.

కరూర్ మృతుల ఆత్మ శాంతి కోసం సామూహిక ప్రార్థనలు



సామూహిక ప్రార్థనలో ప్రజలు

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో శనివారం జరిగిన తొక్కిసలాటలో చిక్కుకుని 41 మంది మృతిచెందారు. మృతిచెందిన వారు ఆత్మ శాంతి కోసం తెన్‌కాశి జిల్లా తోరన్‌మలై మురుగన్ ఆలయంలో భక్తులు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే, మృతుల కుటుంబాలకు మనోధైర్యం కల్పించాలంటూ దేవుడిని ప్రార్థించారు.

కంచి కలెక్టరేట్ వద్ద రైతు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

ప్యారీస్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార సమావేశంలో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలంరేపింది. జిల్లాలోని విబ్బేడు గ్రామానికి చెందిన జాన్‌బాస్కో (59)కి చెందిన 55 సెంట్ల భూమిని అతడి బంధువు కబ్జా చేయడంపై ఫిర్యాదు చేసేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లిన జాన్‌బాస్కో పెట్రోల్ శరీరంపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడ ఉన్న పోలీసులు అతడిని అడ్డుకుని ప్రశ్నించగా, తన భూమి కబ్జా వ్యవహారంలో పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులకు రెండేళ్లుగా పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఎలాంటి ఫలితం కనిపించలేదని అందువల్లే అతను ఆత్మహత్యకు యత్నించినట్లు విచారణలో తేలింది.

కారైక్కాల్‌కు చెందిన 12 మంది జాలర్ల అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు కొనసాగుతున్నాయి. శ్రీలంక నావికాదళం దాడులు, అక్రమ అరెస్టులను అడ్డుకోవాలంటూ జాలర్ల సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ క్రమంలో, కారైక్కాల్‌కు చెందిన 12మంది జాలర్లు కొడియకరై ప్రాంతంలో చేపలు పడుతుండగా, వారిని చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారంటూ బెదిరించడంతో పాటు, జాలర్లపై తుపాకులు ఎక్కుపెట్టి, వారిని అరెస్ట్ చేసి శ్రీలంక హార్బర్‌కు తరలించింది. ఈ విషయాన్ని కారైక్కాల్ జాలర్లు మత్స్యశాఖ అధికారులకు తెలియజేశారు.

బాలికను గర్భిణిని చేసిన వ్యక్తి కోసం గాలింపు

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలో 13 ఏళ్ల బాలికను గర్భవతిని చేసి పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నారు. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుమార్తె, 13 ఏళ్ల బాలిక ఒకే పాఠశాలలో చదువుకుంటున్నారు. అతను తన కుమార్తెతో పాటు 13 ఏళ్ల బాలికను కూడా పాఠశాల నుంచి తీసుకొస్తుంటాడు. ఈ క్రమంలో, కొద్దిరోజులుగా ఆ బాలిక కడుపునొప్పితో బాధపడుతుండడంతో, తల్లిదండ్రులు ఉసిలంబట్టి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు, ఆమె ఐదు నెలల గర్భంతో ఉందని చెప్పడంతో దిగ్భ్రాంతి చెందారు. వారు కుమార్తెను ప్రశ్నించగా, తనను పాఠశాల నుంచి తీసుకువచ్చే స్నేహితురాలి తండ్రి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని బెదిరించినట్లు బాలిక తెలిపింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉసిలంబట్టి మహిళా పోలీసులు, పరారైన ఆ వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

హెరాయిన్, గంజాయి స్వాధీనం

● త్రిపుర రాష్ట్రానికి చెందిన ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలో వాహనతనిఖీల్లో హెరాయిన్, గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. వెప్పేరి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం బేరక్స్ రోడ్డులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో సందేహాస్పందంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు పొంతన లేని సమాధానాలిచ్చారు. పోలీసులు వారి బ్యాగులు పరిశీలించి, 220 హెరాయిన్ మాత్రలు, 3 గ్రాముల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు... త్రిపుర రాష్ట్రానికి చెందిన షాహిదుల్ ఇస్లాం (21), ఖాహితీ మియా (20)గా గుర్తించి వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

అనుమానం పెనుభూతమై..!

● ప్రియురాలిని హతమార్చిన విద్యార్థి

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తనను దూరం పెడుతూ, వేరే యువకుడికి దగ్గరవుతోందన్న అనుమానంతో ఓ విద్యార్థి తన ప్రియురాలిని హతమార్చిన ఘటన మదురైలో చోటుచేసుకుంది. చిన్నమంగళం ప్రాంతానికి చెందిన జయసూర్య (19) పాఠశాల విద్య తరువాత ఇంట్లో ఉంటున్నాడు. జయసూర్య మేనమామ కుమార్తె శివకాశికి చెందిన యువతి(17) ఆ ప్రాంతంలోని నర్సింగ్ కళాశాలలో చదువుతోంది. ప్రదీప, జయసూర్య ప్రేమించుకుంటున్నారు. అయితే ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతున్న జయసూర్యను ఆ యువతి కొద్దిరోజులుగా దూరంగా పెడుతోంది. అదే సమయంలో ఆమె మరో యువకుడికి దగ్గరైనట్లు జయసూర్య అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో, ఆదివారం సాయంత్రం తన ప్రియురాలిని తీసుకుని బయటకు వెళ్లిన జయసూర్య.. వాగ్వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య వివాదం పెరగడంతో జయసూర్య.. ఆ యువతి తలపై బండరాయితో మోదాడు. దాంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మరణించిన తరువాత జయసూర్య నేరుగా వెళ్లి ఒత్తుకడై పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తండ్రీ కూతుళ్లను కబళించిన కెరటం



మృతులు వెంకటేశన్, కార్తీక, తులసి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సముద్రం అలల్లో చిక్కుకుని తండ్రి, ఇద్దరు కుమార్తెలు మృతిచెందారు. అగరం ప్రాంతానికి చెందిన వెంకటేశన్ (37) ఆదివారం కుమార్తెలు కార్తీక (17), తులసి (16), బంధువులు, స్నేహితులతో కలిసి 17 మంది తిరుపోరూర్ మురుగన్ ఆలయానికి వెళ్లారు. అనంతరం మహాబలిపురం సమీపం సూలేరికాడు బీచ్‌కు వెళ్లారు. అక్కడ వెంకటేశన్, ఇద్దరు కుమార్తెలు సహా 8 మంది సముద్రంలో స్నానాలకు దిగారు. ఆ సమయంలో భారీ అలకు వెంకటేశన్, కుమార్తెలు కార్తీక, తులసి, బంధువు హేమలత తదితరులు నీళ్లలో కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడ ఉన్న జాలర్లు వారిని రక్షించేందుకు యత్నించారు. ఓ జాలరి హేమలతను రక్షించి తీరానికి తీసుకొచ్చాడు. కొద్దిసేపటికి వెంకటేశన్ మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న మహాబలిపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హేమలతను చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించి, గల్లంతైన ఇద్దరి కోసం గాలించారు. ఈ నేపథ్యంలో, వారి మృతదేహాలు రాత్రి తీరానికి కొట్టుకొచ్చాయి. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో భర్తను కడతేర్చిన భార్య

● సైదాపేట పోలీసుల విచారణ

ప్యారీస్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేటలో మద్యం మత్తులో భర్తను కత్తితో నరికి చంపిన భార్యవద్ద పోలీసులు విచారణ ప్రారంభించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రహ్లాద్ సర్దార్ (42)అనే తాపీమేస్త్రి సైదాపేట మ్యాంగోగార్డెన్ పాఠశాల సమీపంలో అద్దె ఇంట్లో భార్య పింకీ (36)తో నివసిస్తూ భవన నిర్మాణం పనుల్లో పాల్గొనేవారు. ఆదివారం రాత్రి ఇద్దరూ కలిసి ఇంట్లో మద్యం సేవించి, తాగిన మత్తులో వారిమధ్య గొడవపడ్డారు. దీంతో పింకీ గొంతు నులిమేందుకు ప్రయత్నించిన భర్తనుండి తప్పించుకునే ప్రయత్నంలో భాగంగా ఇంట్లో ఉన్న కూరగాయల కత్తితో భర్త గొంతు నరికింది. గాయపడిన ప్రహ్లాద్‌ను ఇరుపొరుగు ఉన్నవారు సైదాపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ అతని పరిస్థితి విషమంగా ఉండటంతో క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతిచెందినట్లు అంబులెన్స్‌లో ఉన్న వైద్యసిబ్బంది నిర్ధారించారు.

కరూర్ ఘటనపై వదంతులు.. బీజేపీ, టీవీకే నేతల అరెస్ట్

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతిద): కరూర్ సభలో తొక్కిసలాట మృతులకు సంబంధించి వదంతులు సృష్టించిన బీజేపీ, తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కరూర్ విషాద ఘటనపై సోషల్ మీడియాలో వదంతులతో కూడిన పోస్టులు పెట్టిన బీజేపీ రాష్ట్ర నిర్వాహకులు సహాయం, టీవీకేకు చెందిన శివనేశన్, శరత్‌కుమార్‌లను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మరో 25 మందిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాచార దృష్టి

వైద్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలైంజర్ సెంటినరీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య సర్టిఫికెట్ కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో.. నగరంలోని 2025-26వ విద్యా సంవత్సరానికి వైద్య సర్టిఫికెట్ కోర్సుల్లో 143 ఖాళీలున్నాయన్నారు. ఏడాది వ్యవధి కలిగిన ఈ కోర్సుల్లో, కార్డియో సోనోగ్రఫీ టెక్నీషియన్ (మహిళలు) 17 సీట్లు, ఈసీజీ, ట్రెడ్‌మిల్ టెక్నీషియన్-20, పంప్ టెక్నీషియన్-9, కార్డియాక్ కాథెటరైజేషన్ లాబొరేటరీ టెక్నీషియన్ (పురుషులు)-20, ఎమర్జెన్సీ కేర్ టెక్నీషియన్-20, డయాలసిస్ అసిస్టెంట్-11, అనస్థీషియాలజీ టెక్నీషియన్-20, ఆపరేటింగ్ థియేటర్ టెక్నీషియన్ కోర్సులో 19 ఖాళీలున్నాయని తెలిపారు. అభ్యర్థులు 2025 డిసెంబరు 31వ తేదీకి 17 సంవత్సరాలు నిండి, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. వివరాలకు https://www.kcssh.org అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

నేడు 'నలం కాక్కుం స్టాలిన్' ప్రత్యేక వైద్యశిబిరం

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండలంలో మంగళవారం 'నలం కాక్కుం స్టాలిన్' ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసిన ప్రకటనలో... జీసీసీ పరిధిలోని 15 మండలాల్లో ఒక వైద్య శిబిరం నిర్వహించాలని నిర్ణయించి, తొలి వైద్యశిబిరం గత నెల 2వ తేది నిర్వహించామన్నారు. ఇప్పటివరకు నాలుగు మండలాల్లో వైద్య శిబిరాలు నిర్వహించగా, ప్రజల నుంచి స్పందన లభించిందని తెలిపారు. ఈ క్రమంలో, అడయార్ మండలం పరిధిలోని తిరువాన్మియూర్ చెన్నై మహోన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో జనరల్ చెకప్, ఎముకలు, మహిళలు, పిల్లలకు సంబంధించిన వైద్యం, నరాలు, చర్మం, దంత, నేత్రం, చెవి, ముక్కు, గొంతు సమస్యలతో పాటు 17 రకాల వైద్యనిపుణులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అడయార్ మండల ప్రజలు ఈ శిబిరం సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

4 వరకు మోస్తరు వర్షాలు

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంగళవారం నుంచి అక్టోబరు 4వ తేది వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... పశ్చిమ విదర్భ దానిని ఆనుకుని ఉన్న ఉత్తర మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లో అల్పపీడనం నెలకొంది. ఇది మంగళవారం బలహీనపడే అవకాశముంది. అదే సమయంలో, దక్షిణ భారత ప్రాంతాల్లో అల్పపీడన ద్రోణి కొనసాగుతోంది. ఈ కారణంగా తమిళనాడులోని ఒకటి రెండు ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. అలాగే, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

సీటు పొంది మెడిసిన్‌లో చేరకపోతే రూ.10 లక్షల జరిమానా

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ఇప్పటివరకు రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తవగా, 2వ విడతలో సీటు పొందిన వారు ఈ నెల 30వ తేదిలోపు ఆయా కళాశాలల్లో చేరాల్సి ఉంది. తొలి రెండు విడతల కౌన్సెలింగ్‌లో సీటు పొందని వారు 3వ విడత కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చు. అలాగే, 2వ విడత కౌన్సెలింగ్‌లో సీటు పొందిన వారు, వేరు కళాశాలలో సీటు పొందేందుకు 3వ విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. మూడో విడతలో సీటు పొందిన వారిని 4వ విడత కౌన్సెలింగ్‌కు అనుమతించరు. అలాగే, 3వ విడత కౌన్సెలింగ్‌లో సీటు పొంది కళాశాలల్లో చేరనివారు రూ.10 లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇదివరకే కట్టిన ట్యూషన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్ తిరిగి చెల్లించరు. కాగా, రెండో విడత కౌన్సిలింగ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో ప్రభుత్వ కోటా సీట్లు, ప్రైవేటు కళాశాలల జనరల్ కేటగిరీ మేనేజ్‌మెంట్ సీట్లు పూర్తిగా భర్తీ అయ్యాయి.

ఈ-వేలం ద్వారా వాణిజ్య స్థలాల విక్రయం

పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలోని ఐదు వేర్వేరు ప్రాజెక్ట్ ప్రాంతాల్లోని 132 వాణిజ్య స్థలాలు ఈ-వేలం ద్వారా విక్రయించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో హౌసింగ్ ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. వీటిలో, వ్యాపారం, పాఠశాల, ప్రార్థన స్థలం తదితరాలకు స్థలం కేటాయిస్తున్నారు. ఈ స్థలాలను వాణిజ్య అవసరాలకు విక్రయించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. తొలివిడతగా తిరువళ్లూర్ జిల్లాలోని తిరూర్‌లో 67, కాకలూరులో 45, పెరుమాళ్‌పేటలో 9, సెవ్వాపేటలో 7, పెరియకుప్పంలో 4 అని మొత్తం 132 వాణిజ్య స్థలాలను ఈ-వేలం ద్వారా విక్రయించనున్నట్లు, ఆసక్తి కలిగిన వారు అక్టోబరు 23వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ బోర్డు తెలియజేసింది.

రేపు ఆదివారం టైం టేబుల్‌తో సబర్బన్ రైళ్లు

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆయుధ పూజ సందర్భంగా గురువారం ఆదివారం టైంటేబుల్ ప్రకారం సబర్బన్ రైళ్లు నడువనున్నాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై సెంట్రల్-అరక్కోణం, చెన్నై సెంట్రల్-సూళ్లూరుపేట, చెన్నై బీచ్-చెంగల్పట్టు తదితర మార్గాల్లో సబర్బన్ రైళ్లు నడుపుతున్నామన్నారు. అక్టోబరు 1వ తేది ఆయుధ పూజ ప్రభుత్వ సెలవు కావడంతో, ఆ రోజు ఆదివారం టైం టేబుల్‌తో సబర్బన్ రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

హజ్ యాత్ర తేదీల వెల్లడి

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు బయల్దేరే తేదీలు ప్రకటించారు. ఆ ప్రకారం, 2026 మే 17 నుంచి 20వ తేది వరకు నగరం నుంచి జెడ్డాకు యాత్ర బయల్దేరుతుంది. మరు మార్గంలో మదీనా నుంచి నగరానికి జూన్ 5 నుంచి 8వ తేది వరకు ప్రయాణం ఉంటుందని అధికారులు తెలిపారు.



ఆడియో రిలీజ్ వేడుకలో చిత్ర బృందం

వ్యవసాయం నేపథ్యంలో 'మరుదం'

రైతుల జీవితం, వ్యవసాయం ఆవశ్యకతను తెలుపుతూ రూపొందించిన చిత్రం 'మరుదం'. ఆరువర్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సి.వెంకటేశన్ నిర్మాణంలో వి.గజేంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కగా, విధార్థ్, రక్షణ జంటగా నటించారు. సామాజిక కథాంశంతో రూపొందించిన ఈ చిత్రం అక్టోబరు 10వ తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర ఆడియో, ట్రైలర్ తాజాగా విడుదల చేశారు. ఇందులో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని ఆడియో రిలీజ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇందులో హీరో విధార్థ్ మాట్లాడుతూ, 'ఈ కథలోని ముఖ్య సారాంశం దేశంలో ఉన్న ప్రతి రైతు జీవితంలో జరిగిందే. అలాంటి చిత్రంలో నటించినందుకు చాలా సంతోషంగా ఉంది. హీరోయిన్‌గా ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై తర్జనభర్జన చెందుతున్న సమయంలో రక్షణ గుర్తుకు వచ్చి ఆమెను ఎంపిక చేశాం. ఇద్దరు పిల్లలకు తల్లిగా నటించేందుకు ఆమె అంగీకరించడం ఎంతో సంతోషం. బాల నటుడిగా దర్శకుడు కుమారుడు మాకంటే ఎంతో బాగా నటించాడు. వాణిజ్యపరంగా విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు గజేంద్రన్ మాట్లాడుతూ, 'ఈ చిత్ర నిర్మాణంలో నా స్నేహితుడు సాట్టై అన్బళగన్ అండగా నిలిచారు. చిత్ర నిర్మాత, కెమెరామెన్ సోమసుందరం ఎంతగానో శ్రమించారు. చిత్రీకరణ పూర్తి చేశాకే సంగీత దర్శకుడిని ఎంపిక చేశాం. ఈ సినిమా కోసం శ్రమించిన ప్రతి ఒక్క నటీనటులు, టెక్నీషియన్లకు ధన్యవాదాలు. నేటి హైటెక్ ప్రపంచంలో రైతు జీవితాన్ని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని, బరువైన స్క్రీన్‌ప్లేతో అన్ని వర్గాల వారు ఎంజాయ్ చేసేలా ఒక కమర్షియల్ మూవీగా 'మరుదం'ను రూపొందించాం' అని వివరించారు. కాగా, ఇతర పాత్రల్లో అరుల్ దాస్, మారన్, శరవణ సుబ్బయ్య, నాగరాజ్, మ్యాథ్యూ వర్గీస్ తదితరులు నటించారు.



ఐటమ్ సాంగ్స్ వల్లే క్రేజ్

● తమన్నా

తెలుగు, తమిళం, హిందీ తదితర భాషా చిత్రాల్లో నటించినా రాని క్రేజ్, పేరు ఐటమ్ సాంగ్స్ ద్వారా వచ్చిందని మిల్కీబ్యూటీ తమన్నా అభిప్రాయపడ్డారు. తాజాగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నేను తెలుగు, తమిళం, హిందీ తదితర భాషా చిత్రాల్లో నటించాను. అపుడు ఏ ఒక్క చిత్రం నాకు సరైన బ్రేక్ ఇవ్వలేదు. కానీ, అల్లు అర్జున్‌తో కలిసి 'బద్రీనాథ్' సినిమాలో నటించిన తరువాత, దానిని చూసిన పలువురు నిర్మాతలు ప్రత్యేక గీతాలు చేసేందుకు ఆహ్వానించారు. అలా దక్షిణ భారత చిత్రాలతో పాటు బాలీవుడ్ మూవీల్లో నేను చేసిన ఐటమ్ సాంగ్‌లు మంచి పేరుతో పాటు క్రేజ్ తెచ్చిపెట్టాయి. అందుకు ముందు కూడా ప్రత్యేక గీతాల్లో నటించేందుకు ఎంతో ఆసక్తిగా ఉన్నాను' అని పేర్కొన్నారు. కాగా, 'అరణ్మనై-4' తర్వాత తమిళంలోనూ, 'ఓదేలా-2' తర్వాత తెలుగులో ఒక్క కొత్త అవకాశం కూడా తమన్నాకు రాలేదు. కానీ, బాలీవుడ్‌లో మాత్రం 'రోమియో', 'రేంజర్', 'వివన్'తో సహా మొత్తం 4 చిత్రాల్లో నటిస్తుండటం గమనార్హం.

చిత్రజ్యోతి

ఆ పెట్టుబడులు ఆదుకుంటున్నాయి

● మాధవన్



తాను సినిమాల్లో సంపాదించిన డబ్బు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టానని, అవి ఇపుడు తనను ఎంతగానో ఆదుకుంటున్నాయని ప్రముఖ హీరో ఆర్.మాధవన్ అన్నారు. అలాగే, తనకు దుబాయ్‌లో ఒక లగ్జరీ నౌక ఉన్నట్టు మీడియాలో సాగుతున్న ప్రచారంపై కూడా ఆయన తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చారు. 'దుబాయ్‌లో ఉంటున్న నాకు సొంతంగా లగ్జరీ షిప్ ఉందంటూ ప్రచారం సాగుతోంది. ఇందులో ఏమాత్రం నిజం లేదు. అయితే, ఒక చిన్న పడవ ఉంది. ఆ బోటు కూడా ఇదే. దీని విలువ రూ.16 కోట్లు. సినిమాల్లో సంపాదించిన మొత్తంలో కొంతమేర దుబాయ్, ముంబైలో కొన్ని ఆస్తులను కొనుగోలు చేశాను. రియల్ ఎస్టేట్‌లో కొంత మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాను. ఈ పెట్టుబడులు ఇపుడు నన్ను ఎంతగానో ఆదుకుంటున్నాయి' అని పేర్కొన్నారు.



సంప్రదాయ పూజలకు తమల పాకులు సిద్ధం - పూజలకు తోరణాలు, పూలు సిద్ధం

కోయంబేడు లారీల నుంచి జామకాయల లోడు దించుతున్న కార్మికులు

మార్కెట్లకు దసరా సందడి..

కొనుగోలుదారుల రద్దీ

● పూజా సామగ్రి ధరలకు రెక్కలు



పూల మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ - అమ్మకాలకు సిద్ధంగా బత్తాయి - గుమ్మడికాయలు, నిమ్మ, టెంకాయలు

ప్యారీస్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపడుతూ ఆయుధపూజ, విజయదశమి వేడుకలు జరుపుకునేందుకు ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బుధ,గురువారాల్లో ప్రత్యేక పూజలకు వాడవాడలా అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. దసరా, శరన్నవరాత్రుల ఉత్సవాల్లో ప్రధానాంశమైన ఆయుధ పూజకు అవసరమైన పూజాసామగ్రి కొనుగోలు చేసే వారితో సోమవారం మార్కెట్లు కిటకిటలాడాయి. మరోవైపు ఈ నెల 1, 2వ తేదీలు సెలవులు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, నగదు, వస్త్ర దుకాణాల్లో ప్రత్యేక పూజలు ముందుగానే నిర్వహించనున్నారు. కాగా, ఆయుధపూజ, విజయదశమి పర్వదినాలను పురస్కరించుకొని పూజకు అవసరమైన అరటి, మామిడి, అరటిగెలలు, పసుపు కొమ్ములు, గుమ్మడికాయలు, పండ్ల రకాలు, పూలు, అటుకులు, బొరుగులు, బెల్లం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నగరంలో ప్రధాన విక్రయ ప్రాంతాలైన టి.నగర్, ప్యారీస్, ఫ్లవర్ బజార్, మైలాపూర్, షావుకారుపేట, కోయంబేడు, అడయార్, తండయార్‌పేట, తిరువొత్తియూర్, పెరంబూర్, ఎగ్మూర్, పురుషవాక్కం, డౌటన్, సైదాపేట, బీసెంట్‌నగర్, విల్లివాక్కం, అయినావరం, అవడి, అంబత్తూరు తదితర ప్రాంతాల్లో సోమవారం నుంచే పూజాసామగ్రి విక్రయాలు ఊపందుకున్నాయి. ఈ ఏడాది పూజాసామగ్రి ధరలు పెరిగినప్పటికీ పూజ కోసం పేద, మధ్యతరగతి ప్రజలు సైతం పండుగ ఏర్పాట్లు చేపట్టారు.

కోయంబేడు ప్రత్యేక సంతలో పెరిగిన రద్దీ...

దసరా సందర్భంగా కోయంబేడు ఆహారధాన్యం మార్కెట్ దుకాణాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సంత కొనుగోలు దారులతో కిటకిటలాడింది. ఇక్కడికి రాష్ట్రంలోని పలు జిల్లాలు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి పూలు, పండ్లు, పూజా సామగ్రి లోడుతో వచ్చే వాహనాలు కోయంబేడు ప్రాంతంలో బారులుతీరాయి. దీంతో సోమవారం ఉదయం వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై దృష్టిసారించిన ప్రత్యేక సంత అధికారి ఇందుమతి ట్రాఫిక్ రద్దీ తగ్గించే చర్యలు చేపట్టారు.

పెరిగిన పూల ధరలు...

ఆయుధపూజ, విజయదశమి పండుగ పూజకోసం వినియోగించే పూలు, పండ్లు, బొరుగులు, అటుకులు సహా మామిడి, అరటి, గుమ్మడి తదితరాల ధరలు విపరీతంగా పెరిగాయి. ఒకటిన్నర కిలో శెనగలు రూ.180, అటుకులు రూ.130, బొరుగులు బస్తా రూ.200కి విక్రయిస్తున్నారు. చామంతిపూలు కిలో రూ.180, మల్లెలు రూ.800, కనకాంబరాలు రూ.800, ముల్లై రూ.600, పన్నీరు రోజ్ కిలో రూ.100, చాక్లెట్ రోజ్ రూ.200 సహా పలురకాల పూలు, దిష్టి గుమ్మడి కాయలు, టెంకాయలు, తమలపాకులు, చెరుకు గడలు, పసుపుకొమ్ముల ధరలు కూడా పెరిగాయని వ్యాపారులు తెలిపారు. కోయంబేడు ఫ్లవర్‌బజార్ మార్కెట్ అధ్యక్షుడు ముత్తురాజ్ మాట్లాడుతూ, పండుగకు రెండు రోజుల ముందే ధరలు రెండింతలు పెరిగాయని, రేపు, ఎల్లుండి పూల ధరలు మరింత పెరిగే అవకాశముందన్నారు.

వీఐటీ వర్సిటీలో ముగిసిన 'గ్రావిటాస్' ఫెస్ట్



వేలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీఐటీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 'గ్రావిటాస్ నాలెడ్జ్ ఫెస్టివల్' ఆదివారం రాత్రి ముగిసింది. ఈ నెల 26 నుంచి ప్రారంభమైన ఈ ఫెస్టివల్‌లో దేశంలోని పలు విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, 22 దేశాలకు చెందిన విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 40వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని, తాము నూతనంగా ఆవిష్కరించిన పరిశోధనలు ప్రదర్శించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి నీతి ఆయోగ్ డైరెక్టర్ శశాంగ్ షా గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. సుమారు 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకోవాలంటే, భారత్ రాబోయే 25 ఏళ్లలో 7.5 శాతం వృద్ధి రేటు సాధించాలన్నారు. ఈ లక్ష్యసాధనలో ఉన్నత విద్య, పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఆయన సూచించారు. వేడుకల్లో కర్ణాటక ఎమ్మెల్యే, ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ శరత్ కుమార్ పచేగౌడ, వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ సహా కళాశాల యాజమాన్యం, ఫెస్టివల్ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పరిశోధనలుగా ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

ప్రధాన నగరాల్లోనూ 'ఐరిస్ ఫేస్ ఆఫ్ తమిళనాడు'

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'నేచురల్ ఐరిస్ ఫేస్ ఆఫ్ తమిళనాడు, ఐరిస్ ఫేస్ ఆఫ్ చెన్నై'కి సంబంధించిన ఆడిషన్లు ఈ సారి చెన్నైతో పాటు మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు తదితర ప్రధాన నగరాలకు కూడా విస్తరించారు. దీని గురించి సంస్థ నిర్వాహకులు డాక్టర్ లతా ఎ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఐరిస్ ఫేస్ ఆఫ్ తమిళనాడు మొదటి ఎడిషన్ ప్రారంభంతో చరిత్ర సృష్టించబడిందని, అలాగే ఐకానిక్ ఐరిస్ ఫేస్ ఆఫ్ చెన్నై 14వ ఎడిషన్ కూడా ప్రారంభించబడిందని వివరించారు. ఈ ఏడాది కార్యక్రమంలో 18 మంది పురుషులు, 30 మంది మహిళలు పాల్గొన్నారని, వీరిలో ఐదు విభాగాల్లో పోటీ పడ్డారని వివరించారు. ఈ ఆడిషన్లలో 4 వేల మంది పాల్గొనగా, కఠినమైన ప్రక్రియ ద్వారా ఫైనలిస్టులను ఎంపిక చేశారన్నారు. అక్కడ వారు ర్యాంప్ వాక్, కొరియోగ్రఫీ శిక్షణ, ఫిట్‌నెస్, అడ్వంచర్ వాక్ సెషన్, సెల్ఫ్ గ్రూ మింగ్, స్కిన్ కేర్ వర్క్‌షాపులు, పర్సనల్ బ్రాండింగ్ తదితర రౌండ్లు నిర్వహించి ఫైనలిస్టులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

ఫైనలిస్టులు



ఫీనిక్స్ సిటీలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాల సందడి

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్ సిటీలో 'వోవ్స్ అండ్ వోగ్ - ఎ వెడ్డింగ్ గాలా' పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కోలాహలంగా సాగాయి. భారతీయ వివాహ విధానం గొప్పతనాన్ని చాటిచెప్పేలా వధూవరుల ఆడిషన్లు, సంగీత్, మెహందీ తదితరాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, తస్వా, కళానికేతన్, కోస్కి, పార్క్ అవెన్యూ, రేమాండ్స్, ఎథ్నిక్స్, సోచ్, అవంత్రా, కుషాల్స్ వంటి ప్రముఖ బ్రాండ్ల నుంచి ప్రత్యేకమైన పండుగ, వివాహ సేకరణలు ప్రదర్శించారు.

సిన్సియర్ సిండికేషన్ 3వ శాఖ ప్రారంభం



కార్యాలయ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

అడయార్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై, కోయంబత్తూరు, నెదర్లాండ్స్‌లోని తన కార్యాలయాల ద్వారా వందలాది కుటుంబాలకు సేవలందిస్తున్న సిన్సియర్ సిండికేషన్ 12వ వసంతంలోకి అడుగు పెట్టింది. అంతేగాక చెన్నైలో తన సేవలను విస్తరించింది. తద్వారా నగరంలో తన మూడో శాఖను ఏర్పాటు చేసింది. ఈ శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా సంస్థ సీఈవో శివరామకృష్ణన్ మాట్లాడుతూ.. కంపెనీ విస్తరణ చెన్నైలో మరో కార్యాలయం ఏర్పాటు చేయడం మాత్రమే కాదని, విదేశాల్లోనూ కంపెనీ బలోపేతం చేయడమన్నారు. యూఎస్, ఇతర ప్రపంచ మార్కెట్లలోని ఆస్తి నిర్వహణ కంపెనీల సహకారంతో, తన ప్రపంచ పాదముద్రను విస్తరిస్తూనే వుందని వివరించారు.

బంగారు రథంపై కన్యకా పరమేశ్వరి అమ్మవారు



బంగారు రథంలో అమ్మవారు

ప్యారీస్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 8వ రోజైన సోమవారం బంగారు రథంలో అమ్మవారు విశేష పూజలు అందుకున్నారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ మహామండపంలో అమ్మవారిని బంగారు రథంపై కొలువుదీర్చి దీపారాధన చేశారు.. ఈ సందర్భంగా భక్తిసంగీతం,భరతనాట్యంతో కళాకారులు అలరించారు. భక్తులందరికీ ట్రస్టీలు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

దుబాయ్ వెళ్లిన ఉదయనిధి



పెరంబూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తన కుటుంబ సభ్యులతో కలిసి దుబాయ్ వెళ్లారు. కరూరు విషాదం చోటుచేసుకున్న సమాచారం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి, దుబాయ్ నుంచి తిరుచ్చి చేరుకుని, అక్కడి నుంచి ఆదివారం ఉదయం 6 గంటలకు కరూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను ఓదార్చి, చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన విషయం తెలిసిందే. అనంతరం సాయంత్రానికి తిరుచ్చి చేరుకుని ప్రత్యేక విమానంలో దుబాయ్ వెళ్లారు. అక్కడ కుటుంబ సభ్యులతో వారం రోజులు గడుపనున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, అక్టోబరు 6వ తేది నగరానికి చేరుకుంటారని సమాచారం.

కరూర్ దుర్ఘటనలో తప్పులున్నాయి

● కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం



ప్యారీస్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనలో అన్నివైపులా తప్పులు జరిగాయని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్రమాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం అభిప్రాయపడ్డారు.శనివారం సాయంత్రం కరూర్‌లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పర్యటనలో ఊహించని విధంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందగా, మరో 50 మందికి పైగా గాయపడ్డారు. కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్ సభలో జరిగిన ఈ దుర్ఘటనపై స్పందించిన కాంగ్రెస్ నేత చిదంబరం సోమవారం తన ఎక్స్‌పేజీలో ఈ మేరకు పోస్టు చేశారు. కరూర్ దుర్ఘటనలో 17 మంది పురుషులు, 15 మంది మహిళలు, 9 మంది చిన్నారులు మృతిచెందడం, మరికొంత మంది గాయపడడం తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని దైవాన్ని ప్రార్థిస్తున్నానన్నారు. సోషల్ మీడియాలో ప్రసారమైన కథనాలు చూసిన అనంతరం కరూర్‌లో అన్ని వైపులా తప్పులున్నట్లు తనకు స్పష్టమవుతోందన్నారు. ఈ అభిప్రాయాన్నే తమిళనాడు ప్రభుత్వ కార్యదర్శికి ఫోన్ చేసి కొన్ని సలహాలిచ్చానని, వాటిని పరిశీలించి నిర్ణయంతీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కరూర్ వ్యవహారంలో ప్రభుత్వ ఆచితూచి అడుగులు వేయాలని రాజకీయ పార్టీలు నిబంధనలకు లోబడి బహిరంగ సభలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని చిదంబరం సూచించారు.



స్వర్ణరథంలో మెరిసిన మలయప్ప

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వర్ణరథంలో దేవేరులతో కలిసి మలయప్ప ఊరేగారు. 4 నుంచి 5.10 గంటల వరకు స్వర్ణరథంలోని దేవదేవులను భక్తులు దర్శించారు. చల్లని వాతావరణం, మధ్యమధ్యలో చిరుజల్లుల నడుమ బంగారు రథం శోభాయమానంగా సాగింది. ఈ స్వర్ణరథాన్ని మహిళలు మాత్రమే లాగడం విశేషం. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని గోవిందనామస్మరణలతో స్వర్ణరథం మోకులను పట్టుకుని లాగారు. భక్తులు, శ్రీవారి సేవకులు, అప్పుడప్పుడు భద్రతా సిబ్బంది సహకరించడంతో స్వర్ణరథోత్సవం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనాలపై శ్రీవారు దర్శనమిచ్చారు. ఆయా వాహన సేవల్లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సంప్రదాయ నృత్య నీరాజనం

కేరళ యక్షగానం, పాండిచ్చేరి ఫోక్ డ్యాన్సు, మైలట్లం, కర్ణాటక పిన్నాల్ అండాళ్ డ్యాన్స్, తెలంగాణ బృందం కోలాటం, ఢిల్లీ కళాకారుల చౌమయూర్ బంజ్, జమ్ము కశ్మీర్ రౌఫ్, పంజాబ్ లూధి నృత్యాలు.. ఇలా సోమవారం ఉదయం 26 కళా బృందాల్లోని 607 మంది కళాకారులు హనుమంత వాహనం ముందు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఒడిశా సంబల్పూడి గౌటిప్ప, మహారాష్ట్రకు సంబంధించి గోందళ్ నృత్యాలతో పాటు శ్రీరామ పట్టాభిషేకం, రామావతారం వంటి పౌరాణిక ఘట్టాలను నృత్య రూపకం ద్వారా ప్రదర్శించారు. ఇక, రాత్రి గజ వాహన సేవలో కర్ణాటక కళాకారుల గజేంద్ర వైభవం, బంజారా నృత్యం, తిరుపతి కళాకారుల మయూర నృత్యం, కోలాటం, గజేంద్రమోక్షం వంటి సంప్రదాయ నృత్యాలు.. తెలంగాణ కళాకారుల పేరిణి.. ఒడిశా కళాకారుల ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు కళా వైభవాన్ని చాటాయి. కీలుగుర్రాల ప్రదర్శన, అష్టలక్ష్మి వైభవం, భరతనాట్య ప్రదర్శనలు భక్తులకు కనువిందు చేశాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

రికార్డుస్థాయిలో భక్తుల 'ఘాట్' ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలలో గరుడసేవ రోజున రికార్డు స్థాయిలో ఆర్టీసీ బస్సుల్లో భక్తులు ఘాట్‌లో ప్రయాణించారు. ఆదివారం పూర్తిగా 425బస్సులు.. తిరుమల- తిరుపతి మధ్య 5,642 ట్రిప్పులు తిరిగి.. 2,16,753మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. నిమిషానికో బస్సు ఏర్పాటుచేసి సీబీఎస్, రైల్వే స్టేషన్, ఇతర పార్కింగ్ స్థలాల నుంచి భక్తులను తిరుమలకు.. అక్కడ్నుంచి మళ్లీ తిరుపతికి చేర్చారు. కాస్త గతేడాది కంటే దాదాపు 30వేల మందికి అదనంగా రవాణా సౌకర్యం కల్పించడం విశేషం. ఆ ఒక్క రోజులో తిరుమల ఘాట్ ద్వారా ఆక్యుపెన్సీ రేషియో 79శాతం నమోదుకాగా, టికెట్ల ద్వారా రూ.1.8కోట్లు వచ్చింది. ఆర్టీసీ అధికారులను, సిబ్బందిని ప్రజా రవాణాధికారి జగదీష్ అభినందించారు.

సిక్కిం విద్యార్థుల 'మరోని' నృత్యార్చన

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిసారిగా సిక్కిం బృందం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ప్రకాష్ ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు, ఉద్యోగులు 'మరోని' అనే నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఈ కళాకారుల్లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్, మెడిసిన్ చదువుతున్న విద్యార్థులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులూ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వాహన సేవలకు అశ్వాలు దూరం

తిరుమల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈసారి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లోని వాహనసేవలకు అశ్వాలు(గుర్రాలు) దూరమయ్యాయి. తొలిరోజు పెద్దశేషవాహనం, మరుసటి రోజు చిన్నశేషవాహన సేవల మినహా మిగిలిన సేవల్లో ఇవి కనిపించలేదు. ఉత్సవ క్రమంలో రెండు గుర్రాలు బెదిరాయి. కొన్నిసార్లు శబ్దాలు కూడా చేశాయి. దీంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా వీటిని గోశాలకు పరిమితం చేశారు. అశ్వవాహన సేవకు మాత్రమే తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. వైష్ణవి, పద్మావతి అనే రెండు ఏనుగులు కూడా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకున్నాయి. అయితే గరుడవాహన సేవ నుంచి రెండూ పాల్గొంటున్నాయి.

బాలుడి అప్పగింత



తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుమలలో తప్పిపోయిన ఏడేళ్ల బాలుడిని పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుప్పం మండలం కెకెతొండ ప్రాంతానికి చెందిన మురుగేష్ కుటుంబం సోమవారం తిరుమలకు వచ్చింది. అఖిలాండం వద్ద మధ్యాహ్నం రద్దీలో మురుగేష్ కుమారుడు చైతన్య నాయక్ తప్పిపోయాడు. వీరు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. డిజిటల్ చైల్డ్ ట్యాగ్ సిస్టమ్ ద్వారా ఈ బాలుడిని గుర్తించి ఎస్పీ సుబ్బరాయుడు సమక్షంలో తల్లి హంసకు అప్పగించారు.



పట్టాలు తప్పిన టవర్ కారు

రైల్వే సిబ్బంది మధ్య కరువైన సమన్వయం

- మోటకంపల్లె వద్ద పట్టాలు తప్పిన టవర్‌కార్
- ఆరేడుగంటలు ఆగిపోయిన పలు రైళ్లు

పూతలపట్టు/చిత్తూరు రూరల్/పాకాల/తిరుపతి సెంట్రల్,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-తిరుపతి రైలుమార్గంలో సోమవారం ఓ టవర్ కార్ పట్టాలు తప్పి పలు రైళ్ల రాకపోకలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.పూతలపట్టు -పాకాల స్టేషన్ల మధ్యలో సోమవారం రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్ పనులు జరిగాయి.పట్టాలతో పాటు విద్యుత్ లైన్లను సిబ్బంది పరిశీలించేందుకు 11.30గంటలనుంచి 1.30 గంటల దాకా ఇంటిగ్రేటెడ్ బ్లాక్ పేరుతో రాకపోకలను ఆపారు.అయితే 12గంటల సమీపంలో పి.కొత్తకోట సమీపంలోని మోటకంపల్లె వద్ద రైల్వే సిబ్బంది మధ్య సమన్వయం కరువై విద్యుత్ లైన్లు చెక్ చేసే ఓహెచ్‌ఈ ఇన్‌స్పెక్షన్ కారు ఇంజన్ పట్టాలు తప్పింది. దీంతో తిరుపతి-చిత్తూరు మార్గంలో రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఎక్కడికక్కడ స్టేషన్లలో ఆపేశారు.తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ ప్రమాద స్థలం వద్దకు వెళ్లారు. రేణిగుంట నుంచి లూకాస్‌ను సంఘటనా స్థలానికి తీసుకెళ్లి ఈహెచ్‌ఈ ఇన్‌స్పెక్షన్ కారును పట్టాలెక్కించి పాకాలకు తరలించేటప్పటికి సాయంత్రమైంది.రాత్రి 8గంటలకు మరమ్మతులు పూర్తి చేసి రైళ్ల రాకపోకలను అధికారులు పునరుద్ధరించగలిగారు.శబరి,మన్నార్గుడి,వెంకటాద్రి, శేషాద్రి,భువనేశ్వరి, రామేశ్వరం, నాగర్‌కోయిల్,ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు తిరుపతి-కాట్పాడి ప్యాసింజరు తదితర రైళ్లు ఆరేడుగంటలు ఆలస్యంగా నడిచాయి. పూతలపట్టు రైల్వేస్టేషన్‌లో కోయంబత్తూరు నుండి తిరుపతి వెళ్ళే రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. అంతకుముందు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రైలు చిత్తూరు స్టేషన్‌లో గంటసేపు ఆగిపోవడంతో ప్రయాణికులు ఆరా తీశారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం ఆగిందని రైల్వే సిబ్బంది చెప్పారు. అదే రైలు పూతలపట్టులో మళ్లీ ఆగిపోవడంతో ప్రయాణికులు రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.



టవర్‌కారును పట్టాలపైకి చేరుస్తున్న లూకాస్

దీంతో టవర్ కారు పట్టాలు తప్పిందని, 2-3 గంటలు ఆలస్యం కావొచ్చని రైల్వే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ప్రయాణికులు ఒకటిన్నర కిలోమీటరు దూరం కొంతమంది ఆటోల్లో, కొంతమంది నడుచుకుంటూ చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారికి చేరుకొని బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.బెంగళూరు-తిరుపతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12 గంటల నుంచి పూతలపట్టు రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది.మన్నార్‌గుడి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను మధ్యాహ్నం 1-30 నుంచి చిత్తూరులోనే ఆపేశారు. రామేశ్వరం-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను పాకాలలో నిలిపివేశారు. పాకాలకు సాయంత్రం 4 గంటలకు రావలసిన కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌ను ముంగిలిపట్టులోనే ఆపేశారు. శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కాట్పాడిలో,హౌరా ఎక్స్‌ప్రెస్‌ను రామాపురంలో, తిరుపతి-కాట్పాడి, కాట్పాడి తిరుపతి డెము రైళ్లను నిలిపివేశారు. రాత్రి 8 గంటల వరకూ అవస్థలు పడిన ప్రయాణికులు తర్వాత లైన్ క్లియర్ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.



తిరుపతి స్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు



పూతలపట్టు స్టేషన్ నుంచి నడిచివచ్చి బస్సెక్కుతున్న ప్రయాణికులు



పాకాల రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన రామేశ్వరం ఎక్స్‌ప్రెస్

కుటుంబమంతా అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులే!

- ఐదుగురికీ ఒకే విశ్వవిద్యాలయం నుంచి పట్టాలు
- వారిలో నేడు స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్
- అందుకోనున్న తిరుపతికి చెందిన గాయత్రి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వారంతా ఒకటే కుటుంబం. భార్యాభర్తలు, వారికి ముగ్గురు సంతానం. పలు కారణాలతో సంప్రదాయ ఉన్నత విద్యకు దూరమైన వీరంతా డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థులుగా.. తమ లక్ష్యమైన ఉన్నత విద్యను అభ్యసించారు. వీరిలో తాజాగా పీజీ పూర్తి చేసిన ఒకరు మంగళవారం జరిగే స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోనున్నారు. తిరుపతికి చెందిన ఎస్.శ్రీధర్ అనే వ్యక్తి టీటీడీలో ఒక చిరుద్యోగి. ఆయనకు ఉన్నత విద్య చదవాలని లక్ష్యం, కానీ అందుకు పరిస్థితులు అనుకూలించలేదు. కుటుంబ స్థితిగతుల నేపథ్యంలో చిన్న ఉద్యోగంలో చేరి ఆ తర్వాత వివాహం, పిల్లలు, వారి పోషణతో సరిపోయింది. అయినా ఉన్నత విద్యపై ఉన్న ఆసక్తికి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వేదికైంది. కుటుంబ స్థితిగతులు కొంత మెరుగయ్యాక అక్కడ ఆయన గతంలో ఓపెన్ విద్య విధానంలో డిగ్రీలో పూర్తి చేశారు. శ్రీధర్ భార్య ఉమాదేవికి కూడా ఉన్నత విద్యపై మక్కువే. చదువుపై ఆసక్తి ఉన్నా పిల్లల పెంపకం అడ్డంకిగా మారింది. అయినా అడ్డంకులను ఛేదించుకొని.. తన భర్త బాటలోనే అదే వర్సిటీలో డిగ్రీలో చేశారు. కుమారుడు కార్తీక్ కూడా సార్వత్రిక విద్యాలయం నుంచి ఎం.కామ్ పూర్తి చేసి అధ్యాపకుడిగా కొనసాగుతున్నారు. పెద్దకుమార్తె ఎస్.విద్య సైతం ఇదే వర్సిటీలో ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తిచేశారు. చిన్న కుమార్తె ఎస్.గాయత్రి తాజాగా అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తిరుపతి అధ్యయన కేంద్రంలో ఎం.కామ్ పూర్తి చేసి, ఉత్తమ ప్రతిభతో బంగారు పతకానికి ఎంపికయ్యారు. లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తర్వాత వెనుకడుగు వేయొద్దని ఆమె అంటున్నారు. పోటీపరీక్షలకు సిద్ధమవుతూ ఎం.కామ్ చదివానని తెలిపారు.



అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చదువుకున్న తిరుపతికి చెందిన కుటుంబం